ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

సోమవారం 10 మార్చి 2025



నేటినుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

- నేడు కల్యాణోత్సవం, 12న రథోత్సవం

ఎల్‌ఆర్‌ఎస్‌కు అడ్డంకులు



- రామగుండంలో నిషేధిత జాబితాలోనే 1924 ఫైళ్లు
- రెవెన్యూ, మున్సిపల్స్ మధ్య సమన్వయ లోపంతో పెండింగ్
- 1510 ఫైళ్లకు షాట్‌ఫాల్
- 40 ఏళ్ల క్రితం నాటి డాక్యుమెంట్లకు గజాల కొర్రీలు
- ప్రభుత్వం కేటాయించిన భూములు సైతం నిషేధిత జాబితాలోనే
- పరిస్థితులను సమీక్షించని యంత్రాంగం

కోల్‌సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో ఎల్‌ఆర్‌ఎస్‌కు అడ్డంకులు తొలగడం లేదు. ప్రతీ రోజు ఎన్ని ఎల్‌ఆర్‌ఎస్ ఫైళ్లు క్లియర్ అయ్యాయనే సమాచారం అడగడం మినాహా యించి ఎందుకు ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి, ఏ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయనే సమీక్షించే పరిస్థితి లేదు. ఎల్‌ఆర్‌ఎస్‌తో మున్సిపాలిటీలకు భారీ ఆదాయం సమకూరుతుందని ఆశలు పెట్టుకున్న ప్రభుత్వానికి శాఖల మధ్య సమన్వయ లోపం ఆదాయానికి ఆటంకం కలిగిస్తోంది. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్-2020 పథకానికి 7,078 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కేవలం 110 దరఖాస్తులు మాత్రమే క్లియర్ అయ్యి ప్రొసీడింగ్‌లు జారీ చేశారు. రూ.1.04 కోట్ల ఆదాయం సమకూరింది. కార్పొరేషన్‌కు వచ్చిన 7,078 దరఖాస్తుల్లో 1924 దరఖాస్తులు ప్రొహిబిటేడ్ జాబితాలోకి వెళ్లాయి. ఇందులో ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు, నాలాలు, హైటెన్షన్ లైన్‌లు, బఫర్‌జోన్లు తదితర భూములు ఉంటాయి. కానీ రామగుండంలో ప్రొహిబిషన్ జాబితాల్లోకి వెళ్లిన భూముల్లో చాలావరకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిస్థలాలు ప్రభుత్వం 30-40 ఏళ్ల క్రితం వివిధ వర్గాలకు మార్కెట్ విలువపై కేటాయించిన భూములుంటున్నాయి. ఇందులో సింగరేణి స్థలాల్లో క్రమబద్ధీకరించిన భూములు సైతం ఉన్నాయి. గోదావరిఖని మార్కండేయకాలనీలో ఉన్న పూర్తిగా పట్టాభూములు ఉండి అభివృద్ధి చెందిన ఒక కాలనీలో కొన్ని దరఖాస్తులను ప్రభుత్వం భూములు అంటూ ప్రొహిబిటెడ్ జాబితాలోకి వెళ్లాయి. వీరు కార్యాలయానికి వచ్చి హైరానా పడుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ చేయడం అటుంచి మా భూములను ప్రభుత్వ భూములుగా ఎలా చూపుతారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఫైళ్లే వెయ్యికిపైగా ఉంటాయని అంచనా. మున్సిపల్, రెవెన్యూ విభాగాల సమన్వయంతో ఫైళ్ల పరిశీలన చేస్తే

(మిగతా 8వ పేజీలో)

● 2,700 దరఖాస్తులకు ఫీజు ఇంటిమేషన్

రామగుండం నగరపాలక సంస్థలో 7078 దరఖాస్తుల్లో 2700 దరఖాస్తులకు సంబంధించి పరిశీలన పూర్తయ్యిందని ఫీజు ఇంటిమేషన్ ఇచ్చింది. ఇందులో 110 ఫైల్స్ మాత్రమే క్లియర్ అయ్యి రూ.1.04కోట్ల ఆదాయం సమకూరింది. టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఒక కౌంటర్ పెట్టి ఫోన్ చేయించడం, దరఖాస్తుదారులతో మాట్లాడున్నారు. 25శాతం రాయితీ ప్రకటించినా కూడా దరఖాస్తుదారులను కదిలించలేకపోతున్నారు. కార్పొరేషన్‌కు విచారణకు వచ్చేవారు ఎక్కువగా షాట్‌ఫాల్స్, ప్రొహిబిటేడ్ జాబితాలో ఉన్న దరఖాస్తుదారులు ఎక్కువగా ఉంటున్నారు. ప్రస్తుతం రామగుండం నగర పాలక సంస్థలో డివిజన్‌కు ఒక వార్డు ఆఫీసర్‌ను నియమించారు. వారికి డివిజన్లలోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల జాబితాలను అందించి సమన్వయం చేస్తే ఫలితాలు ఉండే అవకాశం ఉంది. మార్చి 31 తేది వరకు రాయితీ గడువు ప్రకటించినా అడ్డంకులు మాత్రం తొలగడం లేదు. దీనికి తోడు నాలుగురోజులుగా ఎల్‌ఆర్‌ఎస్ సర్వర్ మాత్రం మూడురోజులుగా మొరాయించింది.

మంత్రి శ్రీధర్‌బాబుతోనే నియోజకవర్గ అభివృద్ధి

కమాన్‌పూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోనే మంథని నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని కమాన్‌పూర్ కాంగ్రెస్ మండల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలో మాట్లాడుతూ మంథని నియోజకవర్గానికి 25 కోట్ల రూపాయలు రోడ్లకు కేటాయించారన్నారు. ఇందులో భాగంగా కమాన్‌పూర్ మండలానికి 40లక్షల రూపాయలు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి, మండల కన్వీనర్ సయ్యద్ అన్వర్, పీఏసీఎస్ చైర్మన్ ఇంగంటి భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి పాల్గొన్నారు.

నవభారత నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

కోల్‌సిటీటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నవభారత నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని, మరింత శక్తితో ముందుకు సాగాలని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి గోదావరిఖని మార్కండేయ కాలనీలో స్టార్ మహిళా-2025 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కందుల సంధ్యారాణి, రచయిత, గాయకుడు మిట్టపల్లి సురేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పలు ఆటలపోటీల్లో గెలుపొందిన స్టార్ మహిళలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోడూరి రమేష్, జనగామ భూమయ్య, మిట్టపల్లి సతీష్, తోట కుమారస్వామి, కండె సాగర్, కొలిపాక శంకర్, పద్మ, అపర్ణ, లతలతో పాటు 800 మంది మహిళలు పాల్గొన్నారు.

‘మౌనిక’మ్మ పెళ్లి కూతురాయెనే..

- అధికారులు అండగా నిలిచి అనాథ యువతి పెళ్లి
- కలెక్టర్ ఆధ్వర్యంలో వైభవంగా వివాహం
- పెళ్లి పెద్దగా వ్యవహరించిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



వధూవరులను ఆశీర్వదిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

మౌనిక ఓ అనాథ.. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో తన ముగ్గురు తోబుట్టువులతో కలిసి కరీంనగర్‌లోని బాలసదనంలో ఉంటుంది. కష్టాలు ఎదురైనా.. కన్నీళ్లను ఆపుకుని చదువుకుని నర్సింగ్ ఉద్యోగం సాధించింది. ఆమె ఇంటర్ తర్వాత ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు చదువుతుండగా పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన సాయితేజతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి ఎలా చేసుకునేది అని ఆలోచించి తల్లిదండ్రులను కోల్పోయిన తర్వాత తమ ఆలనాపాలనా చూసుకుంటున్న అధికారులకు ఈ విషయం తెలిపింది. వారు సాయితేజ కుటుంబసభ్యులతో మాట్లాడి ఒప్పించారు. కరీంనగర్ కళాభారతిలో ఆదివారం అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. కలెక్టర్ పమేలా సత్పతి పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కరీంనగర్‌డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పెళ్లి పెద్దగా వ్యవహరించి భోజనాలు ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

వేలంలో పాల్గొని సింగరేణిని రక్షించండి

- కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి - డిప్యూటీ సీఎంతో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నేతలు



డిప్యూటీ సీఎంతో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్, సీతారామయ్య

గోదావరిఖని, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నిర్వహించే బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనాల్సిన అనివార్యతను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర పరిధిలోని గనులను దక్కించుకునేలా ప్రభుత్వం సహకరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు కోరారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య డిప్యూటీ సీఎంను కలిశారు. ఈసందర్భంగా సింగరేణి విషయాలపై చర్చించారు. వేలంలో పాల్గొనకుంటే బొగ్గు బ్లాక్‌లు ఇతర సంస్థలు చేజిక్కుంచేకునే అవకాశాలు ఉన్నాయని, దీంతో సింగరేణికి తీవ్రం నష్టం జరుగుతందని తెలిపారు.

వేలంలో పాల్గొనకపోవడం ద్వారా కోయగూడెం, సత్తుపల్లి గనులు ప్రైవేట్ సంస్థకు దక్కాయని తెలిపారు. ఈరెండు గనులు సింగరేణికి వచ్చి ఉంటే ఏడాదికి ఆరు మిలియన్ టన్నుల బొగ్గు అదనంగా వచ్చేదని అన్నారు. సింగరేణికి పుట్టినిల్లు లాంటి ఇల్లందు ఏరియాలో గనులు మూతపడి గత వైభవాన్ని కోల్పోతున్నదని, ఇటువంటి తరుణంలో కోయగూడెం బ్లాక్‌ను గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ప్రైవేట్ సంస్థ దక్కించుకున్నట్టు వారు తెలిపారు. కోయగూడెం సింగరేణికి వచ్చి ఉంటే ఏడాదికి మూడు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసేదని, 20 ఏళ్లకు సరిపడా నిల్వలు ఉన్న బ్లాక్ చేజారిపోవడం వలన సింగరేణితో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి నష్టం జరిగినట్టు జనక్‌ప్రసాద్, సీతారామయ్య తెలిపారు. సత్తుపల్లి బ్లాక్‌ను దక్కించుకునే అవకాశం వచ్చినా గతప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చేజారిపోయినట్టు వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల కారణంగా సింగరేణికి రావాల్సిన రెండు కీలక బొగ్గు బ్లాక్‌లు నష్టపోయినట్టు వివరించారు. వేలం ద్వారా సింగరేణి బొగ్గు బ్లాక్‌లను దక్కించుకుంటే ప్రభుత్వంతో పాటు వినియోగదారులకు మేలు జరుగుతందని తెలిపారు. వేలం ప్రక్రియ ద్వారా గనులు పొందితే 18.5 శాతం పన్ను చెల్లించాలన్సి ఉంటుందని, అదే కేటాయింపుల ద్వారా జరిగితే 28 శాతం పన్ను చెల్లించాల్సి వస్తుందని తెలిపా రు. దీని ద్వారా కంపెనీకి టన్ను బొగ్గు మీద రూ.198 ఆదా అవు తుందని జనక్‌ప్రసాద్, సీతారామయ్య పేర్కొన్నారు. తక్కువ ధరకు విద్యుత్ సంస్థలకు బొగ్గు సరఫరా చేసే అవకాశం ఉం టుందని తెలిపారు. కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిం చాలని డిప్యూటీ సీఎంను కోరారు. సొంతింటి పథకం అమలు చేయడం, పెర్క్స్ మీద ఐటీ రీయింబర్స్ చేయడం వంటివి అమలు జరిగేలా చూడాలని డిప్యూటీ సీఎంని కోరారు. సింగరేణికి అన్నివిధాల సహకరిస్తామని త్వరలో కార్మిక సంఘాలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి, సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమాని అవసరమైన అంశాలపై చర్చిస్తామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎంని కలిసిన వారిలో గుర్తింపు, ప్రాతిని ధ్య సంఘాల నాయకులు నర్సింహారెడ్డి, వైవీ రావు, మడ్డి ఎల్లయ్య, త్యాగరాజన్, సమ్మయ్య, శంకర్‌రావు, వికాస్ కుమార్, జిగురు రవీందర్, బాజీ సైదా ఉన్నారు.

కరాటే పోటీల్లో బంగారు పతకాలు

సుల్తానాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సుల్తానాబాద్ విజ్ఞాన్ హైస్కూల్‌కు చెందిన పలువురు బంగారు, వెండి పతకాలు సాధించారని కరాటే కోచ్ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో విజ్ఞాన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు కటాఫ్ విభాగంలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరచారని వివరించారు. సాయి కార్తీక్, శ్రీహర్షిణి, గొల్ల కీర్తన, విగ్నేష, ప్రవస్థి, కీర్తన బంగారు పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ అబ్బు బుచ్చిరెడ్డి, పీఈటీ అంజన్‌కుమార్, చందు తదతరులు అభినందించారు.

సినీనటి జయప్రద కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కళ్యాణ్‌నగర్, 9(ఆంధ్రజ్యోతి): సినీనటి జయప్రద కుటుంబాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ దంపతులు పరామర్శించారు. ఇటీవల జయప్రద సోదరుడు రాజబాబు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం హైద్రాబాద్‌లోని జయప్రద నివాసంలో జరిగిన దశదిన కర్మలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ఆయన సతీమణి మనాలి ఠాకూర్ పాల్గొన్నారు. రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జయప్రత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రపంచానికి అంబేద్కర్ ఆదర్శప్రాయుడు



ఖనిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శ ప్రాయుడని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి పేర్కొన్నారు. పూలె, అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. భిన్న సంస్కృతులు, మతాలు, ఆచారాలు, భాషలు ఉన్న మన దేశాన్ని ఏకతాటిపై నిలిపి అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం అంబేద్కర్ చేసిన కృషి అనిర్వచనీయమైనదని తెలిపారు. సకలజనులకు దిక్సూచిలాంటి రాజ్యాంగ రూపకల్పన ఆయన శ్రమ అని పేర్కొన్నారు. అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఆకునూరి బాలంకుస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇరుగురాల కిష్టయ్య, కొంకటి రాజయ్య, శనిగరపు పోచయ్య సంపత్, మేకల సురేష్, ఆకునూరి స్వామి పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలో మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జ్ఞాన మాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి, మార్కండేయకాలనీ చౌరస్తాలోని మహాత్మాజ్యోతిబాపూలే విగ్రహాలకు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేష్, ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేష్‌బాబు, అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ డిప్యూటీ సీఈవో మిట్టపల్లి రాజేంద్రకుమార్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కొంకటి లక్ష్మణ్, కాంపెల్లి సతీష్, బూడిద మహేందర్, కనుకుంట్ల సమ్మయ్య, కాశిపాక రాజమౌళి, నమూన్ల శ్రీనివాస్, జంబుద్వీప, శనిగరపు రామస్వామి, నవాబ్, రాజేష్, ఇందారపు రవి, నల్లాల శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్: ఆదివారం కమాన్‌పూర్ మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అబేంద్కర్ విగ్రహం వద్ద ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కమాన్‌పూర్ మండల అధ్యక్షుడు కనకయ్య ఆధ్వర్యంలో జ్ఞానమాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలవారు పాల్గొనగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దాసు రామస్వామి, బీసీ నాయకుడు జంగాపల్లి రాజేష్, ఇనగంటి మురళిమనోహర్‌రావు, పెనుగంటి మురళీమనోహర్‌రావు, జంగపల్లి రాజేష్, దాసరి రామచందర్, కొమ్ము సమ్మయ్య, దాసరి పోచం, గన్నవరపు రాయమల్లు, ఆటో డ్రైవర్లు శ్రీధర్, దీకొండ రమేష్, మైనార్టీ నాయకులు మతిన్ తాటిపెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న కాలనీ వాసులు

ధర్మారం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 2న ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన “ తాగునీటి కోసం పోరాటం” కథనానికి అధికారులు స్పందించి ఆ కాలనీకి తాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గత సోమవారం ఎంపీవో రమేష్‌తో పాటు మిషన్ భగీరత ఏఈ, పంచాయతీ కార్యదర్శి కాలనీని సందర్శించి ఎంత మేర పైప్‌లైన్ అవసరం ఉంటుందో కొలతలు తీసి అంచనాలను రూపొందించారు. కాగా ఆదివారం అందుకు సంబంధించిన పనులను అధికారులు ప్రారంభించారు. ఎక్స్‌కావేటర్‌తో అరవై మీటర్ల మేర కాలువ తీసి పైపు లైన్ వేసే పనులను కాలనీ వాసులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆంధ్రజ్యోతి కథనానికి అధికారులు స్పందించి వేగంగా పనులు చేపట్టడం శుభపరిణామని ఎర్రగుంటపల్లి గ్రామస్థులు పేర్కొన్నారు.

మనిషి నైతిక జీవనాన్ని అలవర్చుకోవాలి

- పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతి స్వామి

మంథని, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మానవుడు తన జీవితంలో నైతిక జీవనాన్ని అలవర్చుకొని ముందుకు సాగాలని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతి స్వామి సూచించారు. స్థానిక శీలేశ్వర-సిద్ధేశ్వరాలయంలో కొనసాగుతున్న సంపూర్ణ రుగ్వేద స్వాహాకార యజ్ఞం ముగింపు సందర్భంగా పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి స్వామి మంథనిలో పర్యటించారు. తొలుత స్వామి వారు ఆలయంలో శీలేశ్వర-సిద్ధేశరస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మానవ మనస్సును ఎల్లప్పుడు మంచి ఆలోచనలపైనే కేంద్రీకరించాలన్నారు. అలజడి, అశాంతికి గురయ్యే మనస్సుకు మంచి ఆలోచనలు రావాలంటే ధ్యానమార్గం ఒక్కటే పరిష్కారమన్నారు. యజ్ఞ, యాగాదుల్లో అందరు భాగస్వాములు కావాలన్నారు. వేద గడ్డగా ప్రసిద్ధిగాంచిన మంథనిలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతుందన్నారు. స్వామివారికి ఆలయ నిర్వాహకులు లోకే మనోహర్, లోకే శరత్ ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. యజ్ఞం, వివిధ అమ్మవార్ల పారాయణలు, స్వామి వారికి ప్రత్యేక పూజలతో రుగ్వేద స్వాహాకార యజ్ఞాన్ని పూర్తి చేశారు. కార్యక్రమ నిర్వాహకులు అమ్నాయవర్ధిని మిత్ర బృందం, వేద పండితులు వొజ్జల గణేష్‌శర్మ, ఆలయ పూజారి దహగం రమేష్, మహావాది విజయ్, శివ, శ్రీపాద్, ఆదిత్య, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ఓదెల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వ్యక్తి ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారని పిరమిడ్ శిక్షకురాలు అరుణ జ్యోతి అన్నారు. మండలంలోని పొత్కపల్లి శివలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పిరమిడ్ మాస్టర్ అరుణజ్యోతి మాట్లాడుతూ ధ్యానం ఒక వ్యసనంగా మార్చుకుంటే శారీరకంగా, మానసికంగా వేదన దూరమై ప్రశాంతత పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి,పుల్లూరి రాంబాబు, కిషన్, శ్రీనివాస్ రెడ్డి,భిక్షపతి తదితరులు పాల్గొన్నారు

● నేటి నుంచి చిరుతల రామాయణం

ఓదెల మండల కేంద్రంలో సోమవారం నుంచి చిరుతల రామాయణం ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సీతా రామచంద్ర స్వామి పట్టాభిషేకం, కల్యాణం నిర్వహించనున్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

- గుంతలమయంగా రహదారి - ఇబ్బంది పడుతున్న వాహనదారులు



ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

మంథనిరూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి వరకు ఉన్న రహదారి ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి వరకు రెండు కిలోమీటర్ల మేర ఎనిమిది మూల మలుపులు, అడుగడుగున గుంతలు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సింగిల్ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టగా రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. గతంలో సూరయ్యపల్లి నుంచి ఉన్న రహదారి వ్యవసాయ పొలాలకు వెళ్లటానికి ఉండేది. సింగరేణి విస్తరణలో రచ్చపల్లి, అక్కెపల్లి గ్రామాలు కోల్పోవడంతో సూరయ్యపల్లి సమీపంలో ఈగ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు ఏర్పాటు చేశారు. కాలనీల ఏర్పాటు సమయంలో రెండు కోట్ల రూపాయలతో సింగరేణి సంస్థ రోడ్డు నిర్మాణం చేసి వదిలి వేసింది. దాన్ని ఎవరు పట్టించుకోకపోవడంతో రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి గుండా రచ్చపల్లి గ్రామప్రజలతో పాటు బిట్టుపల్లి, ధర్మారం, చిన్నఓదాల, గోపాల్‌పూర్, ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి, జిల్లల్లెపల్లి, సీతంపల్లి గ్రామస్థులు ప్రయాణిస్తారు.

ఖమ్మంపల్లి వద్ద మానేరు నదిపై వంతెన నిర్మాణం పూర్తి కావడంతో భూపాలపల్లి జిల్లాలోని మల్హర్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు నిత్యం వందలాది వాహనాల్లో ఈ రహదారి గుండా ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టంతోపాటు మూల మలుపుల వద్ద ఉన్న చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై ఉన్న గుంతలు

రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకులకు తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని మొదటి బైపాస్ రహదారి మూలమలుపు వద్ద కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం మహమ్మదాపూర్ గ్రామానికి తల్లీకొడుకులు మహేశ్వరి, హరికృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హరికృష్ణ తన తల్లి మహేశ్వరిలు కలిసి ద్విచక్రవాహనంపై కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపునకు వెళుతున్న క్రమంలో ఎల్లారెడ్డిపేట మొదటి బైపాస్ రోడ్డు మూలమలుపు వద్ద స్కూటీ అడ్డుగా వచ్చింది. దాంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

కథలాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని చింతకుంట శివారులో ఉన్న 29/1 కంపార్ట్‌మెంట్‌లోని అటవీభూమిని అక్రమంగా చదును చేస్తున్న మూడు బ్లేడ్‌ట్రాక్టర్లను అటవీ అధికారులు పట్టుకున్నారు. శనివారం అర్ధ రాత్రి భూమిని చదును చేస్తున్నట్టు అందిన పక్కాసమాచారం మేరకు దాడులు నిర్వహించామని ఫారెస్ట్ సెక్షన్ అధికారి మస్తాక్ అలీ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను కథలాపూర్ పోలీస్ స్టేషన్‌కు బీట్ అధికారులు సాయిరాం, శివరాజ్, శ్రావణ్ కుమార్, బేస్ క్యాంపు సిబ్బంది రాజ్య, రాజేశ్‌తో కలిసి తరలించామని చెప్పారు. అడవులను నరికివేసినా, ఆక్రమించేందుకు ప్రయత్నించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎఫ్ఎస్‌వో హెచ్చరించారు.

నిలిచిన పంప్‌హౌస్ పనులు

- గత ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా ప్రారంభం
- రూ.13.43 కోట్లతో కొండగట్టుపై శాశ్వత నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ
- వరదకాలువ నుంచి తరలింపునకు ప్రతిపాదనలు
- పంప్‌హౌస్ ఏర్పాటు తవ్వకాలతోనే నిలిచిన పనులు
- రూ.22కోట్లతో మళ్లీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు


సంతోళ్లలొద్ది రిజర్వాయర్

మల్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో శాశ్వత నీటి ఎద్దడి నివారణకు చేపట్టిన పంప్‌హౌస్ పనులు నిలిచిపోయాయి. రెండేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారం భించిన పనులు నత్తనడన సాగి ప్రస్తుతం పూర్తిగా ఆగి పోయాయి. అధికారుల రీడిజైన్‌తో పాటు పూర్తి స్థాయి ఎస్టిమేట్ అంటూ మళ్లీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంప డంతో ఈ పథకం పనులపై నీలినీడలు అలుముకున్నాయి. 2023 ఫిబ్రవరి15న కొండగట్టుకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. దేవస్థానం అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయిస్తామని ప్రకటించడంతో పాటు రూ.100కోట్లు విడుదల చేస్తున్నట్లు జీవో కూడా జారీ చేశారు. ఇందులో భా గంగా రూ.13.43కోట్లతో కొండపైన శాశ్వత నీటి సౌకర్యానికి నీటి లభ్యతను బట్టి కాళేశ్వరం జలాలు, ఎస్సారెస్పీ నీటిని వినియోగించడం కోసం ముత్యంపేట శివారులోని వరదకాలువ వద్ద పంప్‌హౌస్ పనులను ప్రారంభించారు. అయితే ఆ పను లు కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. పూర్తి స్థాయిలో పథకం చేపట్టడానికి అంటూ ఇరిగేషన్ అధికారులు మళ్లీ ప్రతిపా దనలు తయారు చేయడం విమర్శలకు తావిస్తోంది. అధికా రులు రెండు సంవత్సరాల కాలంలో రెండుసార్లు ప్రతిపాదనలు రూపొందించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.


వరదకాలువ వద్ద నిలిచిపోయిన పంప్‌హౌస్ పనులు

వరద కాలువ నుంచి పైప్‌లైన్

కొండపైన శాశ్వత నీటి సరఫరాకు ముత్యంపేట సమీపంలోని వరదకాలువ 81కి.మీ నుంచి నీటి సరఫరాకు గాను సుమారు 1.8కి.మీ దూరంలో గల సంతోళ్లలొద్దికి పైప్‌లైన్ ప్రతిపాదించారు. ఇం దుకు గాను వరదకాలువ వద్ద పంప్‌హౌస్ నిర్మించి ప్రెజర్ పంప్‌ల ద్వారా సంతోళ్ల లొద్దికి తరలించనున్నారు. నిత్యం 5 క్యూసెక్కుల నీరు తరలించేందుకు 2 భారీ పంప్‌మోటార్ల ఏర్పాటుకు నిర్ణయిం చారు. సంతోళ్లలొద్ది నుంచి మిషన్‌భగీరథ ద్వారా అంజన్న సన్నిధానంకు నీటిని పంపించ నున్నారు. అయితే ప్రస్తుతం సంతోళ్లలొద్ది సామర్థ్యం 358 ఎఫ్‌టీఎల్ మాత్రమే కాగా 370కి పెంచనున్నారు. దీంతో 2.50ఎంసీఎ ఫ్‌టీ నుంచి 13 ఎంసీటీఎఫ్‌కు పెరగనుంది. అయితే ఈ పనులన్నీ ఆరు నెలలోనే పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు వరదకాలువ వద్ద రూ.కోటి విలువైన పంప్‌హౌస్ వద్ద తవ్వకాల పనులు మాత్రమే పూర్తి కాగా ఆరు నెలలుగా ఆ పనులూ నిలిచిపోయాయి. ప్రస్తుతం వరద కాలువకు శ్రీరాంసాగర్ ప్రా జెక్ట్ నుంచి నీటిని వదులుతుండగా ప్రాజెక్ట్‌లో నీటి మట్టం తగ్గినప్పుడు ఎల్లంపల్లి నీటిని వరదకాలువపై నిర్మించిన పంప్‌హౌస్‌ల ద్వారా కొన్నేళ్లుగా తరలిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆ నీటిని కొండగట్టు పంప్‌హౌస్ ద్వారా కొండపైకి తరలించ డానికి కూడా ప్రతిపాదించారు. దీంతో కొండగట్టులో శాశ్వత నీటి ఎద్దడి లేకుండా కార్యాచరణ చేపట్టగా ప్రస్తుతం పనులు మూలన పడడంతో పనులు త్వరితగతిన చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

రీఎస్టిమెట్‌తో ఆలస్యం

- సుధాకిరణ్, ఈఈ, ఇరిగేషన్

గతంలో పనుల ప్రారంభం కోసం అప్పటికప్పుడు ప్రతిపాదనలు రూపొందించి రూ.13.43కోట్లతో పనులు చేపట్టాం. అయితే భవిష్యత్తు అవసరాలు, పూర్తి స్థాయి పథకం చేపట్టడానికి ఇటీవల మళ్లీ రూ.22 కోట్లతో రీఎస్టిమెట్స్ తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాం. ఇది ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రభుత్వ అనుమతులు రాగానే పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

అదృశ్యమైన మహిళ ఆత్మహత్య


వెంకవ్వ(ఫైల్)

మల్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓగులాపూర్‌కు చెందిన జేశెట్టి వెంకవ్వ(50) అనే మహిళ గురువారం రాత్రి నుంచి అదృశ్యం కాగా ఆమె మృత దేహం ఆదివారం జగిత్యాల మండలం అంతర్గాం సమీపంలోని కాకతీయ కెనాల్‌లో లభించింది. ఇంట్లోనుంచి వెళ్లిన వెంకవ్వ కెనాల్‌లో దూకిఆత్మహత్యకు పాల్పడినట్లు సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తుండగా వెంకవ్వ అదృశ్యంపై మల్యాల పోలీసులు కేసు నమోదుచేశారు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెదుకుతుండగా కెనాల్‌లో మృతదేహం లభించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మతిస్థిమితం సరిగా లేకే ఇంట్లో నుంచి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నంబర్ ప్లేట్‌లేని బైక్‌లకు జరిమానా

మంథని, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నంబర్‌ప్లేట్లులేని వాహనాలు, ట్రిబుల్ రైడింగ్, అధిక శబ్దం వచ్చేలా సంచరిస్తున్న బైక్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్‌ఐరమేష్ ఆదివారం తెలిపారు. నంబర్ ప్లేట్లు లేకున్న, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో దొరికిన వారికి కౌనెల్సింగ్ ఇచి జరిమానా విధించి వదలి పెట్టినట్లు తెలిపారు.

కల్వర్టును ఢీకొని యువకుడు మృతి


నరేష్ (ఫైల్)

మానకొండూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కల్వర్టు ఢీకొని నరేష్ అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన గొర్రె వెంకటయ్య బంధువులు మండలంలోని కొండపల్కల గ్రామంలో శనివారం మృతిచెందారు. దీంతో వెంకటయ్య, అతని భార్య, కుమారుడు గొర్రె నరేష్(30) కలిసి బైక్‌పై అక్కడికి వెళ్లారు. రాత్రి సమయంలో తల్లిదండ్రులతోపాటు నరేష్ ఇంటికి తిరిగి వచ్చారు. కొండపల్కలలోనే ఇంటితాళం చెవి మరిచిపోగా నరేష్ బైక్‌పై మళ్లీ కొండపల్కలకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా పచ్చునూర్-మద్దికుంట గ్రామాల మధ్య ఉన్న కాకతీయ కాల్వ కల్వర్టుకు ఢీకొని కాల్వలో పడిపోయాడు. వెనకాల వెళుతున్న మరో వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు నరేష్‌ను అదే రాత్రి చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటయ్య ఆదివారం ఫిర్యాదుచేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

బావిలో మట్టిగడ్డలు పడి ఒకరి మృతి

చందుర్తి, మార్చి9 (ఆంధ్రజ్యోతి): బావిలో పూడిక మట్టి తీస్తుండగా పైనుండి మట్టిగడ్డలు కూలడంతో ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో శని వారం రాత్రి జరిగింది. చందుర్తి ఎస్ఐ అంజయ్య కథనం ప్రకారం.. మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన గద్దరాసి రాములు(48) అనే కూలీ వ్యవసాయ బావిలో పూడిక తీస్తుండగా పైనుంచి మట్టిపడడంతో కూలీ తలకు గాయాల య్యాయి. గాయపడ్డ రాములును చికిత్సనిమిత్తం వేములవాడలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ సంఘ టనపై మృతుడి భార్య నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఒకకొడుకు, ఒక కూతురు ఉన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


అవినాష్ (ఫైల్)

సుల్తానాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లిలో ఈతకు వెళ్లిన అవినాష్‌రెడ్డి (15) అనే బాలుడు బావిలో మునిగి మృతిచెందాడు. కాట్నపల్లి గ్రామానికి చెందిన మోరపల్లి రత్నాకర్‌రెడ్డి ఒకే ఒక్క కుమారుడైన అవినాష్‌రెడ్డి తన ఇంటి పక్కను ఉన్న మరో బాలుడు (6)తో కలసి సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. అవినాష్‌రెడ్డి ఈత కొట్టేందుకు బావిలో దిగాడు. ప్రమాదవశాత్తు బావిలో మునిగిపోతుండగా బావి గట్టు మీద ఉన్న బాలుడు వెంటనే ఇంటి వద్దకు వెళ్లి కుటుంబసభ్యులకు తెలిపాడు. పలువురు బావిలో దిగి అవినాష్ రెడ్డిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. ఒకే ఒక్క కుమారుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. బాలుడి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సుల్తానా బాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో ఒకరి బలవన్మరణం


సంపత్‌రెడ్డి(ఫైల్)

చిగురుమామిడి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని సీతారాంపూర్ గ్రామానికి చెందిన కొండం సంపత్‌రెడ్డి(48) అప్పుల బాధలు భరించలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై బండిరాజేశ్ ఆదివారం తెలిపారు. వ్యవ సాయం కోసం, ఇతర కుటుంబ అవసరాల కోసం దాదాపు 8లక్షలరూపాయల వరకు అప్పులు ఉన్నాయి. అప్పుల బాధభరించలేకు ఇంట్లో ఎవ రూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని యువతి ఆత్మహత్య

కొడిమ్యాల, మార్చి9 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని దమ్మయ్యపేట గ్రామానికి చెందిన మన్నెగుంట్ల పుష్పలత(24) అనే యువతి మతిస్థిమితం సరిగాలేక ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ అర్జ రాజు తెలిపారు. పుష్పలతకు కొన్నేళ్ల నుంచి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది దమ్మయ్యపేట గ్రామ శివలింగాల గుట్టపై చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కార్మిక, కళా సాంస్కృతిక సేనాని జాకబ్

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


జాకబ్ విగ్రహావిష్కరణ చేస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

కోల్‌సిటీటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రజా, కార్మిక కళాక్షేత్రంలో సాంస్కృతిక సేనానిగా జాకబ్ సేవలు మరువలేనివని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి అన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో గోదావరిఖని న్యూఅశోకథియేటర్ వద్ద ఏర్పాటు చేసిన జాకబ్ విగ్రహాన్ని చాడ వెంకటరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన స్మారక సభలో ఆయన మాట్లాడారు. ప్రజా కళాకారుడు జాకబ్ కళారంగానికి, కార్మికక్షేత్రానికి చిరస్మరణీయుడని కొనియాడారు. జాకబ్ సింగరేణి ఉద్యోగాన్ని కొనసాగిస్తూనే సీపీఐ, ఏఐటీయూసీకి అనుబంధంగా ఉన్న ప్రజానాట్య మండలిలో జాతీయ స్థాయిలో ప్రజలకు, కార్మికులహక్కుల కోసం, వారి సంక్షేమం కోసం తనరచనలు, పాటలతో సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా కళాకారుడు దయానర్సింగ్ రచించిన జాకబ్ స్మృతిగీతం సీడిని మాజీ ఎమ్మెల్యేలు చాడవెంకటరెడ్డి, కాసిపేట లింగయ్య ఆవిష్కరించారు. ఇప్టాజాతీయ నాయకులు కె.స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె శంకర్, మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, సీపీఐ నాయకులు తాండ్ర సదానందం, సీనియర్ జర్నలిస్టులు మాదాసు రాంమూర్తి, మల్లావఝుల వంశీ, కవి, రచయిత బానూరి సత్యనారాయణ, తారా కల్చరల్ అకాడమి బాధ్యులు సంకె రాజేష్, జాకబ్ సోదరి యాంజిలాడెవిస్, మంచిర్యాల జిల్లా సీపీఐ నాయకులు రామడుగు లక్ష్మణ్, బెల్లింపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్, సీపీఐ పూర్వ జిల్లా కార్యదర్శి గోసిక మోహన్, ప్రజానాట్య మండలి నాయకులు కన్నం లక్ష్మీనారాయణ, జాకబ్ సతీమణి లలితాజాకబ్, కవులు కళాకారులు రాకుమార, చంద్రపాల్, ఎల్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి ప్రజల సంక్షేమమే ధ్యేయం

- గర్షకుర్తి బస్సు పునరుద్ధరణ
- పంటలు ఎండుతున్నాయని ఎమ్మెల్యే సత్యంకు రైతుల మొర


బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం గంగాధర మండలం కురిక్యాల నుంచి గర్షకుర్తి మీదుగా వేములవాడకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కురిక్యాలలో బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే గర్షకుర్తి వరకు బస్సులో టిక్కెట్టు తీసుకుని ప్రయాణించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిరుమల్‌రావు,తాజామాజీ సర్పంచ్ అలువాల నాగాలక్ష్మీ,నాయకులు జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, కిషన్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, మహిళలు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నాయి..

గర్షకుర్తికి బస్సును ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గ్రామరైతులు నీరులేక వరిపొలాలు ఎండుతు న్నాయని నిలదీశారు. రైతుబంధు, రుణమాఫీ ఏదీ అంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎక్కడ పంటలు ఎండు తున్నాయో చూపిం చాలని ఎమ్మెల్యే అన్నారు. దీంతో రైతులు ఆయనను ఎండుతున్న పొలాల వద్దకు తీసుకెళ్లారు. పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే రైతులతో మాట్లాడుతూ పంటలు ఎండి పోకుండా అధికారులతో మాట్లాడి నీరందించ డానికి కృషి చేస్తానని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామంలో నిల్వఉంచిన 17సంచుల రేషన్‌బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదివారం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తక్కువ రేటుకు రేషన్ బియ్యాన్ని సేకరించి నిజామాబాద్ జిల్లాకు తరలించడానికి వెల్లులలో నిల్వ చేసినట్లు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారులకు దాడులు నిర్వహించగా అక్రమంగా నిల్వచేసిన 8.95 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించామన్నారు. అధికారులు తనిఖీ చేస్తుండగా వ్యాపారస్థుడు గమనించి అక్కడి నుంచి పారిపోయా డన్నారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగించామన్నారు. రేషన్ బియాన్ని పట్టుకున్న సిబ్బందిని సీఐ నిరంజన్‌రెడ్డి అభినందించారు.

బిట్టుపల్లి శివారులో పులి అడుగుల గుర్తింపు

- ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు


పులి పాదముద్రలను గుర్తిస్తున్న అటవీ అధికారులు

మంథనిరూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిట్టుపల్లి శివారులో శనివారం రాత్రి సంచరించిన పులి పాద ముద్రలను ఆదివారం అటవీ శాఖ అధికారులు గుర్తించారు. బిట్టుపల్లి శివారులో పెద్దపులి సంచారాన్ని గ్రామానికి చెందిన వ్యక్తి చూడటంతో ఫారెస్టు, పోలీసులు సిబ్బంది రాత్రి నుంచి పులిజాడ కోసం పరిశీలించారు. బిట్టుపల్లి వైపు వెళ్లిన పులి తెల్లవారుజామున తిరిగి గోపాల్‌పూర్ వైపు వెళ్లినట్లు పులి పాదముద్రలను ఫారెస్టు సిబ్బంది గుర్తించారు. గోపాల్‌పూర్ శివారులోని కాలువ వరకు, పంట చేల్ల వరకు పులి అడుగులు ఉన్నాయి. అయితే పెద్దపులి గోపాల్‌పూర్ లేదా శాస్త్రులపల్లి అటవీ ప్రాంతం వైపు వెళ్లి ఉంటుందని ఫారెస్టు అధికారులు తెలిపారు. రెండురోజులుగా పులి పాదముద్రలు అధికారులు గుర్తించడంతో బిట్టుపల్లి, గోపాల్‌పూర్, శాస్త్రులపల్లి, చిన్న ఓదాల అటవీ ప్రాంతాలకు చెందిన ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంత రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలాలు, అటవీ ప్రాంతానికి రాత్రి పూట వెళ్ళ వద్దని ఫారెస్టు డిప్యూటీ రేంజర్ రమేష్ కోరారు.

కోర్టు ప్రాంగణంలో ఇరువర్గాల వాగ్వాదం

కోల్‌సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పోచమ్మ మైదాన్ భూవివాదంలో నమోదైన కేసుల రాజీ విషయంలో స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం ఇరువర్గాల మధ్యవాగ్వాదం జరిగింది. కోర్టు ప్రాంగణంలో వాగ్వాదానికి దిగిన ఇరువర్గాల వారిపై శనివారం రాత్రి అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. కాంగ్రెస్ నాయకుడు తాళ్లపల్లి యుగంధర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు న్యాయవాది, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీష్‌పై అట్రాసిటీ కేసునమోదైంది. న్యాయవాది ఎరుకల ప్రదీప్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీజేపీ నాయకుడు సుల్వ లక్ష్మీనర్సయ్య, పెద్దపెల్లి రవీందర్, శివాజీ నగర్‌కు చెందిన తోట వేణుపై అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. కేసుకు సంబంధించిన గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోదావరిఖని పోచమ్మ మైదాన్ స్థలాల విషయంలో గతంలో అఖిలపక్షంగా ఏర్పడి పోరాడారు. ఈవిషయమై కోర్టు సిఫార్సుమేరకు కాంగ్రెస్ నాయకుడు తాళ్లపల్లి యుగంధర్, బీజేపీ నాయకులు సుల్వ లక్ష్మీనరసయ్య, పెద్దపల్లి రవీందర్‌పై కేసులు నమోదయ్యాయి. శనివారం లోక్‌అదాలత్ సందర్భంగా కేసులో రాజీ పడేందుకు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పిటిషన్ దారులతో మాట్లాడుతున్నారు. వీరికి న్యాయవాదిగా ఉన్న తౌటం సతీష్ తనను కాదని ఎలా రాజీ పడతారని అడ్డుచెప్పాడు. ఈవిషయమై ప్రశ్నించినందుకు తనను దూషించినట్లు తాళ్లపల్లి యుగంధర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు అడ్వకేట్ సతీష్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. కాగా మహిళా దినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్ వద్ద కార్యక్రమం జరుగుతుందని, ఆసందర్భంలో ఇరువర్గాలు గొడవ పడుతుండగా మధ్యలో వెళ్లి కోర్టు ప్రాంగణంలో గొడవ పడవద్దని చెప్పినందుకు తనను కులం పేరుతో దూషించినట్టు న్యాయవాది ఎరుకల ప్రదీప్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు సుల్వ లక్ష్మీ నర్సయ్య, పెద్దపల్లి రవీందర్, తోట వేణులపై అట్రాసిటీ కేసును పోలీసులు నమోదు చేశారు.

బ్యాటరీలు ఎత్తుకెళ్లిన నిందితుల అరెస్టు


దొంగల అరెస్టు చూపుతున్న పోలీసులు


సుల్తానాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ లారీ అసోసియేషన్ ప్రాంతంలో పార్కింగ్ చేసి ఉన్న లారీల నుంచి బ్యాటరీలను దొంగిలించుకుపోయిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈనెల 3వ తేదీన శాస్త్రినగర్ వద్ద నిలిపి ఉంచిన లారీలకు సంబంధించిన 22బ్యాటరీలను దొంగతనం చేశారు. ఈ మేరకు లారీల యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన సుల్తానాబాద్ పోలీసులు ఆదివారం నిందితులను పట్టుకున్నారు. చోరీ చేసిన బ్యాటరీలను ఓ కారులో కరీంనగర్ తరలిస్తుండగా సుల్తానాబాద్ వద్ద పోలీసుల వాహనాల తనిఖీలో పట్టుబడ్డారని ఎస్ఐ శ్రావణ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా సీసీసీకి చెందిన శ్రీను, మహేష్ పట్టుబడగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బ్యాటరీలను దొంగిలించినట్టు తేలిందని ఎస్ఐ తెలిపారు. గతంలో వీరు అనేక దొంగతనాలు చేసి జైలు జీవితం కూడా గడిపారని జల్సాల కోసం తరుచూ చోరీలకు పాల్పడుతున్నారని వివరించారు.

రెండు బైకులు ఢీ

- ఐదుగురికి తీవ్రగాయాలు

తిమ్మాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ గ్రామ రాజీవ్‌రహదారిపై రెండుబైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైకుల మీద ఉన్న ఐదుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి మహాత్మానగర్ గ్రామ రాజీవ్ రహదారిపై వెళుతున్న ఓ ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈసంఘటనలో మహాత్మానగర్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీడాక్టర్ శంకరయ్యతోపాటు మరో ముగ్గురుయువకులు తీవ్రంగా గాయ పడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న తిమ్మాపూర్ సీఐ స్వామి క్షతగాత్రులను స్థానికుల సహాయంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో రామకృష్ణ కాలనీచెందిన ముగ్గురు యువకులు తిమ్మాపూర్‌కు సంబంధించి ఇద్దరు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





బ్రహ్మోత్సవాలకు వేళాయె..

ధర్మపురి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ఈనెల 22 వరకు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయం పక్షాన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయంలో క్యూలైన్లు, చలువ పందిర్లు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఆలయాలు, గోపురాలకు రంగులు వేయించి విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. గోదావరి నది, స్నానఘట్టాల వద్ద పందిర్లు, దుస్తుల మార్పిడి కోసం తాత్కాలిక గదులు ఏర్పాటు చేయించి, స్నానాలు చేసేందుకు షవర్స్ కూడా ఏర్పాటు చేశారు. ఉత్సవాలు తిలకించేలా ఆలయాలు, కూడళ్ల వద్ద స్ర్కీన్స్ ఏర్పాటు చేశారు.

● బ్రహ్మోత్సవాల్లో కార్యక్రమాలు

తొలిరోజు యజ్ఞాచార్యుల ఆహ్వానం, కళశ, విశ్వక్‌సేన, వాసుదేవ, పుణ్యాహవచనం, బ్రహ్మ కలశ స్థాపన, అంకురార్పణ, వరహా తీర్థం, పుట్ట బంగారం తెచ్చుట వంటి కార్యక్రమాలు ఉంటాయి. మంగళవారం స్వామివారల కల్యాణోత్సవం, 12న లక్ష్మీ నరసింహస్వామి ఊరేగింపు సేవ ఉంటుంది. 13న వేంకటేశ్వర స్వామి ఊరేగింపు, 14న బ్రహ్మ పుష్కరిణిలో శ్రీ యోగ (పాత) నృసింహస్వామి తెప్పె, డోలోత్సవాలు, 15 న బ్రహ్మ పుష్కరిణి(కోనేరు)లో శ్రీ ఉగ్ర (కొత్త) లక్ష్మీ నృసింహ స్వామి తెప్పె, డోలోత్సవాలు ఉంటాయి. 16న బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్పె, డోలోత్సవాలు, సాయంత్ర 4 గంటలకు లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ఉంటుంది. 17న సాయంత్రం 4 గంటలకు శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర, రాత్రి 8 గంటలకు భోగ మండప ఉత్సవం, 9 గంటలకు వేద సదస్సు నిర్వహిస్తారు. 18న సాయంత్రం 4 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి, దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు, రాత్రి 8 గంటలకు డోపోత్సవం, 19న మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు చక్రతీర్థం, రాత్రి 9 గంటలకు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారల పుష్పయాగం ఉంటుంది. 20న రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి పుష్పయాగం, రాత్రి 9 గంటలకు శ్రీ యోగ (పాత) లక్ష్మీనర్సింహ స్వామి ఏకాంతోత్సం, 21న రాత్రి 7 గంటలకు శ్రీ కొత్త (ఉగ్ర) నరసింహ స్వామి పుష్పయాగం, రాత్రి 9 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి ఏకాంతోత్సవం నిర్వహిస్తారు. 22 న రాత్రి 9 గంటలకు శ్రీ కొత్త (ఉగ్ర)నారసింహస్వామిఏకాంతోత్సవాలు ఉంటాయి.

● క్షేత్రంలోని ఆలయాలు

ధర్మపురి క్షేత్రంలో చూడదగిన ఆలయాల్లో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి, శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీ యమ ధర్మరాజు, సంతోషిమాత, శ్రీ రామ, శ్రీ దత్తాత్రేయ స్వామి, శ్రీ గడ్డ ఆంజనేయ స్వామి, శ్రీ శివ సాయిబాలాజీ, అయ్యప్ప స్వామి, శ్రీ భక్త మార్కండేయ, గోదావరి మాత, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ, సత్యవతి (ఇసుక స్తంభం), మహాలక్ష్మి ఆలయాలు ఉన్నాయి. క్షేత్ర సమీపంలో శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి, తిమ్మాపూర్ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయాలు ఉన్నాయి.



యమ ధర్మరాజు ఆలయం

- ధర్మపురిలో నేటి నుంచి 22వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ముస్తాబైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

● అతిథులకు ఆహ్వానం

బ్రహ్మోత్సవాల కోసం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ లకు ఆహ్వానం అందించామని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. స్వామి వారల కల్యాణోత్సవం కోసం ప్రభుత్వం తరఫున కలెక్టర్ పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ఈవో పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
-ఈవో శ్రీనివాస్



లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేశాం. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాం. గోదావరి నది, స్నానఘట్టాల వద్ద పందిర్లు, స్నానాలు చేసేందుకు షవర్స్ ఏర్పాటు చేశాం. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాలకు హాజరై స్వామి వారిని దర్శనం చేసుకోవాలి.





సుల్తానాబాద్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం
విశేష అలంకరణలో వేణుగోపాలస్వామి

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన ఆలయం, స్వామి వారికి విశేషాలంకరణ
- 10న రాత్రి కల్యాణోత్సవం, 12న రథోత్సవం

సుల్తానాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీసత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రా రంభం కాను న్నాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆల యాన్ని అందంగా రంగులతో ముస్తాబు చేశారు. గర్భగుడిలోని మూలస్వామి వారిని విశేషంగా అలకంరించారు. ఉత్సవమూర్తులకు కిరీటాలు ఇతర అభరణాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం విశ్వక్సేన అరాధన, పుణ్యావచనం, అంకురార్పణం, ధ్వజారోహణం, గరుడ బలి, యాగ శాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయి. సోమవారం సాయంత్రం వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆల యంలో ఎదురు క్కోళ్లు అనంతరం వేణుగోపాలస్వామి ఆలయంలో రాత్రి కల్యాణం నిర్వహిస్తారు. 12వ తేదీన స్వామివారి రథోత్సవం జరుగుతుంది. ఆలయంలో ప్రతీ ఏటా ఫాల్గుణ మాసంలో బ్రహ్మో త్సవాలు నిర్వహి స్తారు. వారం రోజులపాటు ఉత్సవాలు జరుగు తాయి. విశేష పూజలు నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- పల్లా మురళీధర్, ఆలయ చైర్మన్




సోమవారం నుంచి నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము. భక్తులకు అన్ని వసతి సౌకర్యాలు కల్పించాం. సోమ వారం కల్యాణం, మంగళవారం నిత్యావహణం, తాళాలు, బలిహ రనం తీర్థప్రసాద పంపిణీ ఉంటుంది. బుధవారం రథోత్సవం నిర్వహిస్తారు. స్వామి వారిని రథంపై ప్రతిష్ఠించి శోబాయాత్ర నిర్వ హిస్తాము. ఇందులో భాగంగా గుడిమిట్ట ఆలయంలో చక్రస్నానం, తెప్పోత్సవాలు జరుగుతాయి.

జీవన్‌రెడ్డి, చాడ వెంకట్‌రెడ్డికి నిరాశ

● ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వని అధిష్ఠానాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మాజీమంత్రి, సీనియర్ కాంగ్రెస్‌నేత టి జీవన్‌రెడ్డి రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఎమ్మెల్యేకోటా ఎమ్మెల్సీలలో ఆయ నకు ఏఐసీసీ అవకాశం ఇవ్వక నిరాశనే మిగి ల్చింది. ప్రస్తుతం కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజక వర్గంలో ఎమ్మెల్సీగా ఉన్న ఆయన పదవీ కాలం ఈనెలతో ముగియనున్నది. పట్టభద్రుల ఎమ్మె ల్సీస్థానంలో ఆయనపేరును టీపీసీసీ ప్రతిపా దించినా ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆయన సుముఖంగా లేకపోవడంతో అల్ఫోర్స్ విద్యాసం స్థల చైర్మన్ వి నరేందర్‌రెడ్డికి అవకాశం కల్పిం చారు. ఆ సందర్భంలో తనకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో అవకాశం కల్పించాలని జీవన్‌రెడ్డి అధిష్ఠానాన్ని కోరినట్లు ప్రచారం జరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన జీవన్‌రెడ్డి ఎమ్మె ల్సీగా ఉమ్మడి జిల్లారాజకీయాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల అనంతరం ఏడాది కాలానికి జగిత్యాల శాసన సభ్యుడిగా గెలిచిన బీఆర్‌ఎస్‌నేత డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రె స్‌లో చేరిన సందర్భంలో జీవన్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు, శ్రేణులు ఆందోళనకు దిగగా అధిష్ఠానం మంత్రిశ్రీధర్‌బాబును జీవన్‌రెడ్డి వద్దకు పం పించి బుజ్జగించింది. జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో జీవన్ రెడ్డి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తామని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు అధి ష్ఠానం ఆయనకు హామీ ఇచ్చారు. ఆయనకు ఎమ్మెల్యే కోటా ఎమ్మె ల్సీల్లో అవకాశం లభిస్తుం దని అందరూ ఆశించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నలుగురు సభ్యు లను గెలిపించుకునే ఎమ్మెల్యేల బలంఉండగా ఏఐసీసీ విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్‌కు అవకాశం కల్పించింది. మరోస్థానా న్ని మిత్రపక్షమైన సీపీఐకి కేటాయించింది. సామాజిక వర్గాలకు ప్రాధా న్యం ఇస్తూ సీపీఐకి ఒకస్థానాన్ని కేటాయిం చాల్సి వచ్చిన కారణంగా జీవన్‌రెడ్డికి అవకాశం దక్కకుండా పోయిందని ప్రచారం జరుగుతు న్నది. ఐదు దశాబ్దాల జీవన్‌రెడ్డి రాజకీయ జీవితంలో మరోపదవి ఏదైనా లభించి కొనసాగే అవకాశం ఉందోలేదో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



జీవన్‌రెడ్డి



చాడ వెంకట్‌రెడ్డి

● 'చాడ'కు ఆశాభంగమే..

శాసన మండలి ఎన్నికల్లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసనసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆశాభంగమే ఎదురయ్యింది. శాసన మండలి ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా నెల్లి కంటి సత్యం పేరు ఖరారైంది. హైదరాబాద్‌లోని ముఖ్దుం భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. దీంతో ఎమ్మెల్సీగా చాడ వెంకట్‌రెడ్డి పేరును ఖరారు చేస్తారని భావించినా చివరకు నెల్లికంటి సత్యం పేరును ఆ పార్టీ ఖరారుచేస్తున్నట్లు ప్రకటించింది. 2023లో పొత్తులో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థిగా పొన్నం ప్రభాకర్ ఇక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించి రాష్ట్రమంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చాడ వెంకట్‌రెడ్డికి అవకాశం తప్పకుండా వస్తుందని సీపీఐ జిల్లా నేతలు భావించినా చివరకు పార్టీ నెల్లికంటి సత్యం పేరును ఖరారు చేసింది. దీంతో చాడ వెంకట్‌రెడ్డికి ఆశాభంగంతప్పలేదు.

రాజన్న భక్తులను మోసం చేసిన బీఆర్‌ఎస్

- పది సంవత్సరాలైనా బ్రిడ్జి పనులను పట్టించుకోలేదు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మూడో బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.85 కోట్లతో శంకుస్థాపన

వేములవాడ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి వస్తే చాలు రంగురంగు బ్రౌచర్లతో మూడో బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయిందని, వాటిపై మోటర్ సైకిళ్లు వెళ్లాయని ప్రజలను, రాజన్న భక్తులను మోసం చేసిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది అని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మూలవాగుపై అసంపూర్తిగా వున్న మూడవ బ్రిడ్జిని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి పరిశీలించి, బ్రిడ్జి నిర్మాణానికి రూ. 6.85 కోట్ల వ్యయంతో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ పాలకుల నిర్లక్ష్యం వలన పది సంవత్సరాలుగా పడవుపడ్డ బ్రిడ్జి పునర్‌నిర్మాణానికి నేడు ప్రజా ప్రభుత్వం ముందుకు తీసుకుపోతుందని అన్నారు. 2015వ సంవత్సరంలో బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేసి పదిసంవత్సరాలు పూర్తయినా పట్టించుకోలే దన్నారు. అంతేకాకుండా మర్రిపెల్లి, లచ్చపేట రిజర్వాయర్‌లు చందుర్తి-మోత్కురావుపేట రోడ్డు నిర్మాణపనులు వేయలేక పోయారని గత ప్రభుత్వాన్ని నిందించారు. సదీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో జిల్లా కలెక్టర్ చొరువతో అనేక నిధులను మన ప్రాంతానికి తెచ్చి అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. గత నెలలో సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ పట్టణంలో సుమారుగా రూ. 700 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. రూ.47 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు, రూ.35 కోట్లతో నిత్య అన్నదాన సత్రం, ఆలయ విస్తరణ చేపట్టడం జరుగుతుందని అన్నారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్రంగా దర్శనం కలిగించేలా ఆలయ విస్తరణ చేపడు తున్నామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడిందని విమర్శించారు. ఈ ప్రాంతానికి నాణ్యమైన విద్యను అందించాలని రుద్రంగి మండల కేంద్రంలో ఏటీసీ కాలేజి, మేడిపెల్లి జూనియర్ కళాశాల మంజూ రు చేయడం జరిగిందన్నారు. తొమ్మిది మాసాల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు వెడల్పు కూడా పూర్తి చేస్తామని, ఎవరు కూడా ఎలాంటి అపోహ పెట్టుకోవద్దని, ఎలక్షన్ కోడ్ రావడంతో కొంత ఆలస్యం అయిందని వివరించారు. ఈ ప్రాంతంలో పుట్టిన బిడ్డగా ఎవరికీ ఏఇబ్బంది రాకుండా చూసుకుంటానని, రైల్వేలైన్‌లో భూమి పోతున్న వారికి కూడా తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు.

ఆలయ విస్తరణ పనులు ప్రారంభం చేయడం జరుగుతుందని, మే నెలలో శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖర్ శర్మ రాజన్న ఆలయానికి వస్తారని తెలిపారు. బస్‌డిపో వద్ద నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు చేపడుతామని, రెండవ బైపాస్‌రోడ్డుల రూ. 80లక్షలతో అన్ని ఒకేరకంగా కూరగాయాల సముదాయం ఏర్పాటుచేయడం జరుగుతుం దని అన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉండి మనందరం కొట్లాడిన 95 శాతం పనులను పూర్తి చేశామని, గంగమ్మ దేవాలయానికి ఒక నడిచి పోయే ట్రాక్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, మహ్మద్ అక్రమ్, నీలం గురువయ్య తదితరులు ఉన్నారు.



బ్రిడ్జి నిర్మాణపనులను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

● ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజే శ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీనెలకొంది. వివిధ ప్రాం తాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్నఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. తెల్లవారుజామునే కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన భక్తు లు పవిత్రస్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరు లను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకుని రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అను బంధ ఆలయాల్లో కుంకుమపూజలో పాల్గొన్న భక్తులు శ్రీభీమేశ్వర, శ్రీకేదా రేశ్వరఆలయాల్లో అభిషేకపూజలో పాల్గొనితరించగా శ్రీబద్దిపోచమ్మ అమ్మ వారికి పట్నాలువేసి నైవేద్యాన్ని సమర్పించిమొక్కులు చెల్లించుకున్నారు.

కొండగట్టులో.. పవిత్రోత్సవాలకు అంకురార్పణ

మల్యాల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో మూడు రోజులపాటు జరిగే పవిత్రోత్సవాలకుగాను ఆది వారం సాయంత్రం అంకురార్పణ చేశారు. యాగశాలలో ఆలయ అర్చకులు విష్వక్సేన ఆరాధన, పుణ్యహవాచనం, అంకురారోహణ, అఖండ దీపస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంత్ రావు, అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాలు జరుపుతున్న అర్చకులు

'మౌనిక'మ్మ పెళ్లి కూతురాయెనే..

- అధికారులు అండగా నిలిచి అనాథ యువతి పెళ్లి
- కలెక్టర్ ఆధ్వర్యంలో వైభవంగా వివాహం
- పెళ్లి పెద్దగా వ్యవహరించిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



నూతన వధూవరులకు దుస్తులు అందిస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చిత్రంలో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బాజా భజంత్రీలు... మేళ తాళాలు... వేద పండితుల మంత్రోచ్చా రణల మధ్య..... పెద్ద ఎత్తున తరలి వచ్చిన అతిథుల సమక్షంలో.... మానకొండూర్ శాసన సభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ పెళ్లి పెద్దగా ఓ అనాథ యువతి వివాహం కరీంనగర్‌లో వైభవంగా జరిగింది. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం స్థానిక కళాభారతిలో ఆదివారం బాలసదనంలో పెరిగిన బాలికకు అన్నీ తామై వివాహం జరిపించారు. వివరాల్లోకి వెళితే..

మౌనిక (పూజ) తన తల్లిదండ్రులను కోల్పోవడంతో 2017 సంవత్సరంలో బంధువులు కరీంనగర్‌లోని బాల సదనంలో చేర్పించారు. బాలసదనంలో అధికారులు ఆమెకు చదువు చెప్పించారు. మౌనిక ఇంటర్ తర్వాత ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సు చదువుతుండగా పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన సాయితేజతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. మౌనిక చదువు పూర్తి చేసుకుని నర్సింగ్ ఉద్యోగం చేస్తోంది. ఇటీవల బాలసదనం అధికారు లకు తన ప్రేమ విషయం చెప్పింది. అధికారులు సాయితేజతోపాటు అతని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అతడి కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించడంతో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు పెళ్లి నిశ్చయించారు. అధికారులే పెళ్లి పెద్దలుగా అన్ని ఏర్పాట్లు చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పెళ్లికి వచ్చే అతిథులకు భోజనం ఏర్పాటు చేశారు. కలెక్టర్ పమేలా సత్పతి వివా హానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అందరూ కలిసి మౌనిక వివాహాన్ని అంగరంగ వైభవంగా జరిపించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి అనాథలకు మేమున్నామనే భరోసాను కల్పించారు. కార్యక్రమంలో డీసీపీవో పర్వీన్, స్టేట్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యురాలు శోభారాణి, మున్సిపల్ డిప్యూటి కమిషనర్ స్వరూపారాణి పాల్గొన్నారు.



వధువును అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



వధూవరులకు నగదు బహుమానం అందజేస్తున్న టీఎన్‌జీవో, టీజీవో ఉద్యోగులు, పెన్షనర్స్

మౌనికకు వివాహం చేయడం ఆనందంగా ఉంది
- పమేలా సత్పతి, కలెక్టర్

మౌనికకు జిల్లా యంత్రాంగం తరఫున వివాహం చేయడం ఆనందంగా ఉంది. మౌనికకు ముగ్గురు చెల్లెలు ఉన్నారు. మౌనిక నర్సింగ్ చదివి ప్రయోజకురాలిగా మారింది. ఆమెను ఉన్నత చదువులు చదివించాలని సాయితేజతోపాటు, వారి కుటుంబ సభ్యులకు సూచించాము. అనాథలు ఎవరూ బాధపడవద్దు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. మౌనిక కుటుంబానికి అండగా ఉంటాము. అనాథలకు ప్రభుత్వం తోడుగా ఉంటుంది.

అనాథలకు అండగా ఉంటాం..
- కవ్వంపల్లి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే

అనాథలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దన్నగా నిరంతంగా తోడుగా ఉంటున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అనాథ యువతి వివాహం ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో జరిపించడం అభినందనీయం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది.

సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు
- సబిత, జిల్లా సంక్షేమ అధికారి

మౌనిక వివాహం కలెక్టర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. సాంప్రదాయ బద్ధంగా హాళీ, మెహందీ ఫంక్షన్ నిర్వహించాము. వివాహానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివాహం జరిపించడం సంతోషంగా ఉంది.

● టీజీవో, టీఎన్‌జీవో, పెన్షనర్స్ సహకారం

సుభాష్‌నగర్: మౌనిక వివాహానికి టీజీవో, టీఎన్‌జీవో, నాలుగో తరగతి ఉద్యోగులు, పెన్షనర్లు తమ సహాయ, సహకారలను అందించారు. మహిళ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు పుస్తె మట్టెలు, ఇతర పెండ్లి సమానులు సమకూర్చారు. టీజీవో నాయకులు 54 వేల రూపాయల చెక్కును, 20 వేల రూపాయల విలువైన బెడ్స్, బీరువా, డ్రెస్సింగ్ టేబుల్, ఇతర ఫర్నీచర్ అందజేశారు. పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి 15 వేల రూపాయలు, మార్కెటింగ్ డీడీ పద్మావతి 10 వేల నగదు అందించారు.

'బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకుడు'

కళ్యాణ్‌నగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి తమను బ్లాక్ మెయిల్ చేస్తున్నట్టు పెద్దపల్లి జిల్లా ఇటుక బట్టీల యజమానులు ఆరోపించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో యజమానులు ఆడెపు వెంకటేశం, శ్యాం మాట్లాడారు. గత ఏడాది ఇరిగేషన్ శాఖ నుంచి సీనరేజ్ అనుమతులు తీసుకుని ఇటుక తయారీకి ఉపయోగించే మట్టిని ముర్మూర్ వద్ద నిల్వ చేశామని తెలిపారు.

మట్టి నిల్వకు అన్నిరకాల ఫీజులు చెల్లించామని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి తన మనుషుల ద్వారా బెదిరించినట్టు వారు ఆరోపించారు. తనను కలకుంటే మట్టి తరలింపును అడ్డుకుంటానని హెచ్చరించినట్టు తెలిపారు. శనివారం ముర్మూర్ నుంచి వచ్చి తమ లారీలను అడ్డుకున్నారని వారు పేర్కొన్నారు. రెండు లక్షల సీనరేజ్ చార్జీలు చెల్లించామని, గత ఏడాది గోదావరి నుంచి మట్టిని తీసుకువచ్చి నిల్వ చేసుకున్నట్టు వెంకటేశం, శ్యాం తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలపై ఆయన ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇటుక బట్టీల పనులను అడ్డుకుంటే సహించేది లేదని వారు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జాఫర్, తోట శ్రీనివాస్, శ్రీకాంత్, ఆంజనేయులు, సతీష్, సుధాకర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ల ద్వారా ఇసుక రవాణా

- ఇసుక అక్రమ రవాణాకు చెక్
- వ్యవసాయ మార్కెట్‌లో ఇసుక నిల్వలు


కాల్వశ్రీరాంపూర్‌ని మానేరు నది


కాల్వశ్రీరాంపూర్ వ్యవసాయ మార్కెట్

కాల్వశ్రీరాంపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్‌లో ఇసుక కుప్పలు పోసి గృహావసరాలకు అందించేందుకు సమాయత్తమవుతోంది. సామాన్యులకు తక్కువ ధరకు ఇసుక అందించేందుకు వ్యవసాయ మార్కెట్‌లో ఇసుక నిల్వలు చేసి ప్రజలకు అందివ్వనున్నారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. గనులశాఖ ద్వారా ఆదాయాన్ని పెంచే ఆలోచనతో ఈవిషయంపై ప్రభుత్వం గనులు, భూగర్భ వనరులశాఖ అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయినట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. మండలంలో మానేరు, హుస్సేన్‌మియా వాగులు ఉన్నాయి. ప్రతిరోజు ట్రాక్టర్లు ఉన్నవారు మానేరు నుంచి, హుస్సేన్‌మియా వాగు నుంచి వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మానేరు ఇసుకకు ఒక రేటు, హుస్సేన్‌మియా వాగు ఇసుకకు మరో రేటు ట్రాక్టర్ల యజమానులే నిర్ణయించి వారిదగ్గర అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇసుక రవాణా మండలంలో మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. మండలంతో పాటు పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాలకు కూడా మండలం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మండలం నుంచి ఇసుకను రామగిరి, ముత్తారం మండలాలకు కూడా ఇసుక తరలిస్తున్నట్లు మానేరు పరివాహక రైతులు ఆరోపిస్తున్నారు. వాగు ఇసుకరాళ్లతో కూడుకొని ఉన్న కారణంగా ఇల్లు కట్టే సుతారులు మానేరు ఇసుక కావాలని చెప్పడంతో గృహాలకు ఉపయోగించేవారు. మానేరు ఇసుక కొనక తప్పడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మానేరు నుంచి ఇసుక తెచ్చే ట్రాక్టర్ యజమానులు వారి ఇష్టానుసారంగా రేట్లను పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. మానేరును ఆనుకొని మొట్లపల్లి, కిష్టంపేట, మీర్జంపేట, పెద్దరాతుపల్లి గ్రామాలు ఉన్నాయి. గ్రామాల నుంచే ఇసుక గృహ అవసరాలకు తీసుకువస్తున్నారు. హుస్సేన్‌మియా వాగు ఇసుకను పునాదులు, బెడ్ పోయడానికి పిల్లర్స్‌కు, సీసీ రోడ్లకు ఉపయోగిస్తున్నారు.

ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ల ద్వారా ఇసుకను తరలించే కార్యక్రమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో గృహ అవసరాలకు ఉపయోగించే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ట్రాక్టర్ యజమానులు ప్రభుత్వానికి ఎలాంటి రుసుం చెల్లించకుండా మానేరువాగు, హుస్సేన్‌మియా వాగు నుంచి వారి ఇష్టానుసారంగా అక్రమంగా తరలిస్తున్నారు. సుమారు పదెకరాల వరకు ఉన్న వ్యవసాయ మార్కెట్‌లో ఇసుక స్టాక్ ఏర్పాటు చేసేందుకు స్థలం కూడా విశాలంగా ఉంది. వ్యవసాయ మార్కెట్‌లో యాసంగి, వర్షాకాలం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. దీంతో వ్యవసాయ మార్కెట్‌లో ఇసుక డంప్‌లు ఏర్పాటు చేస్తే ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇబ్బందులు ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేరే స్థలంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవలసి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్‌లో ఇసుక డంప్‌లు ఏర్పాటు చేస్తే సామాన్యులకు గృహ అవసరాల కోసం ఇసుక అందుబాటులో ఉండడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. దీంతోపాటు ఇసుక అక్రమ రవాణాకు చెక్ పడే అవకాశం ఉంటుంది.

ఎల్ఆర్ఎస్‌కు అడ్డంకులు

(5వ పేజీ తరువాయి)

ఇవి క్లియర్ అయ్యే అవకాశం ఉంది. వీటి ఆదాయమే రూ.10 కోట్ల నుంచి రూ.12కోట్లు సమకూరే అవకాశం ఉంది.

● 40ఏళ్ల క్రితం నాటి డాక్యుమెంట్లు షాట్‌ఫాల్

రామగుండం నగరపాలక సంస్థలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో షాట్‌ఫాల్స్‌కు సంబంధించిన 1,510 దరఖాస్తులున్నాయి. ఇందులో వివిధ రకాల కారణాలతో ఫైళ్లను పెండింగ్‌లో పెట్టారు. ముఖ్యంగా 1975-90 మధ్యన కొనుగోలు చేసిన భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు ఉంటున్నాయి. ప్రస్తుతం నగర పాలక సంస్థ ఉన్న పరిధి పలు గ్రామపంచాయతీల పరిధిలో ఉండేది. జనగామ, మేడిపల్లి, ఎల్కలపల్లి, అల్లూరు, మారేడువాక, మల్కాపురం, పాత రామగుండం వంటి గ్రామాలుండేవి. వీటిని విలీనం చేసి నోటిఫైడ్ ఏరియా కమిటీగా ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఆ భూముల కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన డాక్యుమెంట్లు మొత్తం గుంటల్లోనే పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ఈ తరహా డాక్యుమెంట్లను షాట్‌ఫాల్స్ జాబితాలో చేర్చారు. గజాల్లో కొలతలు లేవంటూ పెండింగ్‌లో పెట్టారు. ఈ డాక్యుమెంట్లు ఉన్న స్థలాల చుట్టు పక్కల ప్రాంతాల్లో కాలనీలు వెలిశాయి. ఈ దరఖాస్తులను మాత్రం పెండింగ్‌లో పెట్టారు. ఇదే రీతిలో చిన్నచిన్న కారణాలతో షాట్‌ఫాల్ పెట్టిన దరఖాస్తులే ఎక్కువగా ఉంటాయి. వీటికి సంబంధించిన టౌన్‌ప్లానింగ్ విభాగాల వద్ద స్పష్టత లేదు. షాట్‌ఫాల్‌కి సంబంధించి దరఖాస్తుదారులకు వివరించి సమస్యను పరిష్కరించాల్సి ఉంటుంది. అలాంటి ప్రయత్నాలు కూడా జరగడం లేదు.

వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక


వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

మంథని, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రావికంటి మనోహర్, కొమురోజు శ్రీనివాస్, అధ్యక్షుడిగా అంకరి కుమార్, ఉపాధ్యక్షులుగా ఇసంపెల్లి కొమురయ్య, వేల్పుల గట్టయ్య, ప్రధాన కార్యదర్శిగా నాంపెల్లి రమేష్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా కుక్కడపు రాంమూర్తి, చిట్టమల్ల సంతోష్, కోశాధికారిగా చిలువేరి సతీష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా గంధం అంజనేయులు, ఆర్గనైజింగ్ సహాయ కార్యదర్శులుగా విష్ణుభక్తుల రఘు, తాటి సమ్మయ్యగౌడ్, క్రీడా కార్యదర్శిగా సమ్మయ్య, సాంస్కృతిక కార్యదర్శిగా లక్కాకుల నాగరాజు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పోతరాజు సమ్మయ్య వ్యవహరించారు.

అనారోగ్యంతో స్నేక్ క్యాచర్ భాస్కర్ మృతి

రామగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన పోతారావేణి భాస్కర్ ఆలియాస్ పాముల భాస్కర్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సింగరేణి పారిశ్రామిక ప్రాంతానికి సుపరితుడైన భాస్కర్ మూడు దశాబ్దల పాటు పాముల పట్టే వృత్తిని చేపట్టారు. ఎంతటి విషసర్పాలను సైతం ఇట్టే పట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించేవాడు. స్నేక్ క్యాచర్‌గా మంచి పేరు సంపదించిన భాస్కర్ ఆకాలంగా మృతి చెందాడం పట్ల పలువురు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కొండ్ర వెంకన్న, బుర్ర శంకర్, సంతోష్‌కుమార్, కొండ్ర సుకుమార్ గౌడ్, గ్రామస్థులు కోరారు.

అలంకారప్రాయంగా ఆడిటోరియం

- ప్రారంభానికి నోచుకోని వైనం
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం



సుల్తానాబాద్‌లోని ఆడిటోరియం

సుల్తానాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సభలు, సమావేశాలు, పెళ్లిళ్ల వంటి శుభకార్యాల నిర్వహణకు ప్రభుత్వం ఆడిటోరియాన్ని నిర్మించింది. లైటింగ్ తోపాటు అన్ని వసతి సౌకర్యాలు కల్పించింది. అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్ భవన నిర్మాణాన్ని పూర్తిచేసి మున్సిపాలిటీకి అప్పగించారు. ఇది జరిగి మూడు సంవత్సరాలు కావస్తోంది. అయినప్పటికీ భవనాన్ని వినియోగంలోకి తేవడం లేదు. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆడిటోరియం అలంకారప్రాయంగా మిగిలిపోయింది. కేంద్రప్రభుత్వం రూర్బన్ పథకం ద్వారా వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు సుల్తానాబాద్ మండలాన్ని 2016లో ఎంపిక చేసింది. వంద కోట్ల రూపాయలను మొదటి విడతగా కేటాయించింది. ఇందులో భాగంగా ఆడిటోరియం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా కోటిపైగా నిధులతో మార్కండేయ కాలనీలో 2023లో భవనం పూర్తిచేసి మున్సిపాలిటికి అప్పగించారు. ఆడిటోరియంను వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులు విస్మరించారు. కనీసం ప్రైవేట్ వారికి లీజుకు కూడా ఇవ్వలేదు. ఆడిటోరియం పూర్తయి మూడేళ్లు దాటుతున్నా ప్రారంభానికి నోచుకోలేదు. నిరుపయోగంగా ఉండడంతో మందు బాబులకు అడ్డాగా మారింది. కొత్త భవనం కిటికీలను ధ్వంసం చేశారు. ఇప్పటికైనా అధికారులు ఆడిటోరియంను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

● పేద, మధ్య తరగతి వారికి అవసరం

- చాతరాజు రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి



కోటి రూపాయలకు పైగా నిధులు వెచ్చించి నిర్మించిన ఆడిటోరియంను పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి తేకపోవడం శోచనీయం. శుభకార్యాలు చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్‌కు వేలకు వేలు ఇచ్చే స్థోమత లేని పేదలకు ప్రభుత్వం నిర్మించిన ఆడి టోరియం ఎంతో ఉపయోగపడుతుంది. అధికారులు ఆడిటోరియంను అందుబాటులోకి తేవాలి. మూసి ఉండడంతో భవనం పాడయ్యే అవకాశం ఉంది.

● నిధులు లేకనే..

- మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్



రూర్బన్ నిధులతో నిర్మించిన ఆడిటోరియాన్ని కాంట్రాక్టర్ మున్సిపాలిటీకి అప్పగించారు. ఆడిటోరియంను నిర్వహించేందుకు తమకు ప్రత్యేకంగా ఎలాంటి గ్రాంట్ లేదు. వినియోగంలోకి తేవాలంటే సిబ్బంది, ఇతర వనరులు, నిధులు కావాలి. దాంతో ఆడిటోరియంను వినియోగంలోకి తేలేకపోయాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

ఎలిగేడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య తండ్రి పెద్దోళ్ల పోచాలు(75) పురుగుల మందు తాగి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు తానపర్తి మోహన్‌రావు, విజయ్‌గౌడ్, బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు పురస్కారం

సుల్తానాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకుగాను సుల్తానాబాద్‌కు చెందిన మెంగని చంద్రశేఖర్‌కు నంది అవార్డు ప్రదానం చేశారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రబారతిలో జరిగిన ఒక కార్యక్రమంలో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ వారు రాష్ట్రవ్యాప్తంగా అవార్డుల ప్రదానం చేశారు. ఇందులో భాగంగా సుల్తానాబాద్‌కు చెందిన మెంగని చంద్రశేఖర్ సేవలను గుర్తిస్తూ వారికి నంది అవార్డును అందించి సత్కరించారు.

'పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర రాయలది'



నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

కళ్యాణ్‌నగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడి పేదల పక్షాన నిలిచిన చరిత్ర రాయల సుభాష్ చంద్రబోస్‌దని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఈదునూరి నరేష్ పేర్కొన్నారు. సుభాష్ చంద్రబోస్ 9వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా నాయకులు సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశంలో ఆర్థిక అసమానతలకు కారణం భూస్వామ్య వ్యవస్థ నిర్మూలన అని భావించిన నాయకుడని, దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాయే అసమానతలకు పరిష్కారమని భావించిన ముందుకు సాగిన నాయకుడిగా సుభాష్ చంద్రబోస్ ఆదర్శప్రాయుడిన నరేష్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఐ కృష్ణ, నాయకలుఉ చిలుక శంకర్, ఈదునూరి రామకృష్ణ, రాజేశం, బుచ్చమ్మ, కొంరయ్య పాల్గొన్నారు.

వ్యాపారులకు ఎస్ఐ కౌన్సెలింగ్



వ్యాపారికి సూచనలు ఇస్తున్న ఎస్ఐ చంద్రకుమార్

రామగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీలోని వ్యాపార సంస్థల యాజమానులకు ఆదివారం ఎస్ఐ చంద్రకుమార్ కౌన్సెలింగ్ చేపట్టారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రొడ్లపైన వినియోగదారులు ద్విచక్రవాహనాలు నిలిపివేయకుండా వ్యాపారస్తులు సూచనలు చేయాలన్నారు. భారీ వాహనాలు తిరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా, వాహనాలు రోడ్లపై నిలిపివేయకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభకు తరలివెళ్లిన పద్మశాలీలు


గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు తరలుతున్న పద్మశాలీలు

కళ్యాణ్‌నగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పద్మశాలీ మహాసభకు ఆదివారం గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పద్మశాలీలు తరలివెళ్లారు. పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పోపా(పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్) సంఘం అధ్యక్షుడు బండారి రాజమల్లు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఐక్యమత్యంతో పద్మశాలీలు అన్నిరంగాల్లో ఎదగాలని, కులస్థులకు ఏకం చేసేందుకు మహాసభ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. హైద్రాబాద్ వెళ్లిన వారిలో పద్మశాలి సంఘం నాయకులు సిరిమల్ల జయరాములు, వడ్డెపల్లి దినేష్, లక్ష్మీనారాయణ, బొద్దుల వేణు, రవీందర్, కొంరయ్య, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎలిగేడు: తెలంగాణ ప్రాంత పద్మశాలీ మహాసభకు మండల కేంద్రం నుంచి పద్మశాలి సంఘం నాయకులు తరలి వెళ్లారు. తరలిన వారిలో నాయకులు మామిడాల రమేష్, బూర్ల సత్యనారాయణ, పోరండ్ల కుమార్, గూడెం వీరేశం, కుసుమ వెంకటేశం, వెంగళదాస్ రాజమౌళి, పర్శ శ్రీనివాస్, మెరుగు రాజేశం, కోడూరి కైలాసం, కట్ల సత్యనారాయణ, ఆంజనేయులు, పెద్ద సంఖ్యలో పద్మశాలి కులబాంధవులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు కందుల ట్రస్ట్ ఆర్థిక సహాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న కందుల సంధ్యారాణి, నాయకులు

కోల్‌సిటీటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఫోటోగ్రాఫర్ గూడూరు శ్యాంసుందర్ భార్య సుశీలాదేవి అనారోగ్యంతో మరణించగా కందుల రాజన్న పటేల్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం అందించింది. ఆదివారం గోదావరిఖనిలోని శ్యాంసుందర్, అతని కుమారులను ఇంటి వద్ద బీజేపీ రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి పరామర్శించారు. సుశీలాదేవి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కందుల రాజన్న పటేల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కందుల సాగర్ చేతుల మీదుగా రూ.5వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోడూరి రమేష్, జి.భూమయ్య, ట్రస్ట్ సభ్యులు బండారి అమర్, ఆవునూరి సురేష్, ఎర్రోజు సాయికృష్ణ, శనిగరపు సతీష్, పవన్, కందుల పోచం పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి

చొప్పదండి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్‌లో అంబేద్కర్ విగ్రహంపై చెప్పుల దండ వేసిన దుండగులపై కఠినచర్యలు తీసుకోవాలని మాల మహానాడు, బీఎస్పీ నాయకులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు కునమల్ల చంద్రయ్య, బీఎస్పీ నియోజక వర్గ ఇన్‌చార్జి పిట్టమనోహర్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా శాలపల్లి, మల్కాపూర్ రహదారులు


గుంతలమయంగా మారిన నర్రశాలపల్లి రోడ్డు

జ్యోతినగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ ఎన్టీపీసీ పరిధిలోని 4, 5వ డివిజన్లలోని ప్రధానమైన రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. నర్రశాలపల్లి రోడ్డు, మల్కాపూర్ రోడ్డు, ఇతర అంతర్గత రోడ్లపై ప్రయాణించడం ఈ ప్రాంత ప్రజలకు నరకప్రాయంగా తయారైంది. పునరావాస కాలనీల బాగోగులు చూడాల్సిన ఎన్టీపీసీ యాజమాన్యం ప్రధానమైన ఈ రెండు రోడ్లను నిర్మించే విషయంలో అనాసక్తి చూపిస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అ లాగే మున్సిపల్ కార్పొరేషన్ ఈ రహదారుల విషయంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల చొరవ లేకపోవడంతో నగరం నడిబొడ్డున ఉన్న పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 4వ డివిజన్ పరిధిలోని ఎస్‌బీఐ బ్యాంకు నుంచి నర్రశాలపల్లి వరకు ఉన్న రోడ్డు ప్రజలకు నరకాన్ని చూపిస్తోంది. దశాబ్దకాలంగా కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో ప్రస్తుతం శాలపల్లి రోడ్డు అడుగడుగునా గుంతల మయంగా తయారైంది. రహదారిపై కృష్ణానగర్, శాలపల్లి, జంగాలపల్లి, మల్కాపూర్‌కు వెళ్లే వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి పరిధిలో పలు ఫంక్షన్ హాళ్లు, విద్యాలయాలున్నాయి. నిత్యం పెద్దసంఖ్యలో వాహనాలు ఈ రోడ్డులో వెళ్తుంటాయి. పునరావాస కాలనీలకు వెళ్లే ఈ రోడ్డును పునరుద్ధరించాల్సిన ఎన్టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. శాలపల్లి రోడ్డు నిర్మాణానికి సీఎస్ఆర్ పథకం కింద గతంలో నిధులను ఎన్టీపీసీ కేటాయించింది. అయితే రెండేళ్లుగా మంజూరు చేసిన నిధులను కార్పొరేషన్‌కు విడుదల చేయడం లేదు. దీంతో కొత్తగా నిర్మించే రహదారి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్నట్లుగా తయారైంది. లలాగే మరో ప్రధానమైన మల్కాపూర్ రహదారి పూర్తిగా గుంతలతో నిండిపోయింది. ఈ రోడ్డులోనే రామగుండం కమిషనరేట్, సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్‌తోపాటు శ్రీనగర్ కలనీ, మల్కాపూర్‌లు ఉన్నాయి. నిత్యం పోలీసులు, సీఐఎస్ఎఫ్ జవానులు, పలు కాలనీలకు వెళ్లే ప్రజలు గుంతలమయంగా తయారైన రోడ్డుపై ప్రయాణించి ప్రమాదాల బారిన పడుతున్నారు. సీఐఎస్ఎఫ్ బ్యారక్స్ వరకు రహదారిని కొంత మేరకు పునరుద్ధరించినప్పటటికీ మిగతా రోడ్డు, రెండు కల్వర్లును నిర్మించాల్సి ఉన్నది. ఇటీవల కాలంలో ఐదారు రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ రోడ్డును నిర్మించేందుకు సైతం ఎన్టీపీసీ రెండేళ్ల క్రితమే సీఎస్ఆర్ కింద నిధులను కేటాయించింది. నిధులను కార్పొరేషన్‌కు విడుదల చేయడంలో ఎన్టీపీసీ తాత్సారం చేస్తున్నది. ఈరెండు కీలకమైన రహదారుల నిర్మాణానికి సంబంధించి గతంలో బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీపీసీ నుంచి నిధులు విడుదల చేయించడంలో ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్టీపీసీ యాజమాన్యం ముందుకు వచ్చి రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఇరుకు కల్వర్టుతో ఉన్న మల్కాపూర్ రోడ్డు

తక్షణం రహదారులను నిర్మించాలి

- పొలాస రాజు, కృష్ణానగర్



ఎన్టీపీసీ తక్షణం శాలపల్లి, మల్కాపూర్ రోడ్లను నిర్మించాలి. పునరావాసల ప్రాంతాల అభివృద్ధిని చూడాల్సిన ఎన్టీపీసీ నిర్లక్ష్యం చేయడం సరికాదు. గతంలోనే రెండు రహదారులకు కేటాయించిన నిధులను మున్సిపాలిటీకి విడుదల చేయాలి. కార్పొరేషన్ అధికారులు ముందుకు వచ్చి ఎన్టీపీసీపై ఒత్తిడి తెచ్చి రహదారులను పునరుద్ధరించాలి. మల్కాపూర్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించి అవసరమైన కల్వర్టును నిర్మించాలి.

నెలరోజుల్లోనే పగుళ్లుబారిన బీటీ రోడ్డు

ఎలిగేడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బీటీ రోడ్డు నెలతీరక ముందే తారు లేచి పగుళ్లబారింది. మండలంలోని లాలపల్లి నుంచి చీమలపేట్ ఆర్ అండ్‌బీ రోడ్డు వరకు 1.400కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.1.60కోట్లు మంజూరు చేసింది. పనులను చేపట్టిన కాంట్రాక్టర్ ఆదరబాదరగా నాణ్యత ప్రమాణాలను పాటించకుండా తారు రోడ్డు నిర్మాణం చేపట్టాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం రోడ్డు ఆదిలోనే పగుళ్ల బారింది. ఇప్పటికైన ఇంజనీరింగ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.